# ప్రకృతి చిత్రం

అవునా కాదా అన్నట్లు నొసలు చిట్లించి చూసిందో మారు ఆ ఇంటి వైపు.

పాత కాలం నాటి డాబా యిల్లు. ముదురు గోధుమ రంగుతో కొత్తగానే ఉంది. ఆవరణ పెద్దదే. ఆరేడొందల చదరపు గజాల స్థలముంటుందేమో! స్థలానికి మధ్యస్థంగా వుందా ఇల్లు. ఇంటి ముందు కాసిన్ని పూల మొక్కలు. గులాబీ, మందార, మల్లె వంటి పూల మొక్కలతోపాటు రంగు రంగుల క్రోటన్సు.

ప్రహారీగోడలు ఎత్తుగానే ఉన్నా యినప గేటులోంచే దృశ్యమంతా కనిపించింది. నలుపు, తెలుపు రంగులు వేసిన ఆ గేటుకు అటూ ఇటూ వున్న ప్రహారీ గోడలపై చలువరాతితో తాపడం చేసిన రెండు పలకలపై ఒకదానిపై 'శశికాంత్' అని వుంది.

సందేహం లేదు. అది అతని పేరే! రెండో దానిపై 'కౌముది' అని ఉంది. బహుశా అది ఆ ఇంటికి పెట్టుకున్న పేరు అయి ఉండొచ్చును. రిక్షా దిగి, రిక్షా అబ్బికి డబ్బులిచ్చేసి సంచీని చేతిలోకి తీసుకుంది. ఆమె వెనకే కాత్యాయని! రెండడుగులు ముందుకు వేసి గేటు దగ్గర ఆగింది. అప్పటికి ఎండ ఇంకా తీక్షణమవలేదు. తెల్లవారు ఝామునెప్పుడో నాలుగు గంటల వేళ బయలుదేరారు. మొదటి బస్సులో వచ్చి పని చూసుకుని వెంటనే వెళ్ళిపోవాలని సంకల్పం. బస్‌స్టాండ్‌లో దిగాక, చిరునామా ప్రకారం ఇల్లు కనుక్కోవడం అట్టే కష్టం కాలేదు. వచ్చిన పని తను అనుకున్నట్టు అయిపోతే బాగుణ్ణు - అనుకుంది.

"ఎవరి కోసం బామ్మగారూ?" - లోపల మొక్కలకు సంరక్షణ చేస్తున్న నౌకరు కుర్రాడు కాబోలు చేతులు తుడుచుకుంటూ వచ్చి అడిగాడు.

"బొమ్మలు వేస్తారు చూడూ శశికాంత్ గారనీ... వారి కోసం వచ్చాం, ఇల్లు యిదే అనుకుంటాను. వారున్నారా?" అడిగింది.

"ఉన్నారు రండి" అంటూ గేటు సగం తీసి, దారి యిచ్చేడు.

గేటు నుండి గుమ్మం వరకూ సిమ్మెంటు దారి.

"ఎవరొచ్చారని చెప్పమంటారు?" అడిగాడు గుమ్మం దగ్గర.

ఏం చెబుతుంది? అంతకుముందు పరిచయమా ఏమన్నానా?

"పేరు చెప్పినా తెలియదులే. చంద్రనగర్ నుండి వచ్చామని చెప్పు" అంది.

ముందు హాల్లో కూర్చోమని కుర్చీలు చూపించి లోపలి కెళ్ళాడు.

నలభై సంవత్సరాల నాటి ఇల్లు. విశాలమైన గదులతో ధృఢంగా వుంది. తలుపులూ దర్వాజాలూ బలంగా, కళాత్మకంగా వున్నాయి. గోడలకు ఫ్రేముల్లో బిగించిన అందమైన చిత్రాలు. ఎదుటి గోడపై నున్న చిత్రం వంక చూసింది. బిడ్డను ఒడిలోకి తీసుకుని పాలిస్తూన్న మాతృమూర్తి వర్ణచిత్రం! రష్యన్ చిత్రకారుడు పెట్రోవ్ వోడ్కిన్ చిత్రించిన అలనాటి 'ది మదర్' చిత్రాన్ని పోలిన అపురూపమైన చిత్రం! వస్త్రధారణ, నాగరికత, సంప్రదాయాలు వేరైనా ఆ స్త్రీ వదనంలో కనిపించే అనురాగానుభూతులు మాత్రం విశ్వవ్యాప్తంగా ఒక్కటే అని నిరూపిస్తున్నాయి.

అలసట వల్ల అంతకంటే ఎక్కువ చూడలేకపోయింది. శరీరం కూడా అలసి వుంది. బస్సులో కూర్చోవడమే అయితే మాత్రం? ఇంట్లో వుంటే యీపాటికి పూజా పునస్కారాలు కానిచ్చి, రెండు గుక్కలు వేడి వేడి కాఫీ తాగి, కాసింత విశ్రాంతి తీసుకునేది. కడుపులో పేగులు కరకరమంటున్నాయి. బస్టాండులో కుర్రాడు 'కాఫీ కాఫీ' అంటూ ఎదుటే నిలబడినా మనస్కరించలేదు.

మనసులోని కోర్కెను గ్రహించిన వాడిలా కాఫీ కప్పులతో ప్రత్యక్షమయ్యాడు, నౌకరు కుర్రాడు. పడవల్లాంటి రెండు పెద్ద కప్పుల్ని టీపాయ్ మీద పెట్టి 'తీసుకోండి' అంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

కాఫీ కప్పును ఆప్యాయంగా చేతిలోకి తీసుకుంటూ 'తీసుకో ఫర్వాలేదు' అన్నట్లు కాత్యాయని వంక చూసింది.

గింజలు వేయించి అప్పుడే తయారు చేసిన పొడితో చేసిన కమ్మని కాఫీ వాసన. నాలుగు గుక్కలు తాగేసరికి శరీరం కుదుటపడింది. కొత్త శక్తి వచ్చినట్టయింది.

ఈ శశికాంత్‌కు పెళ్ళయిందో లేదో! ఏ పాటి వయసువాడో! అని తలపోస్తూ కుడివైపు గోడకున్న చిత్రాల వంక చూసి తల తిప్పుకుంది. కాత్యాయని ఆ విషయమే చెప్పకపోతే ఇలా ప్రయాణమయ్యేవారా? ఇరవై ఏళ్ళుగా తట్టని ఆలోచన. ఈ అయిదేళ్ళ నుండీ నిరంతరం హెచ్చరిస్తోంది! ఎన్నెన్నో అపురూపమైన కళాఖండాలను సృష్టించారాయన. తుది శ్వాస వదిలేవరకూ కళకే అంకితమయ్యారు. భారతీయ చిత్రకారులైన రవివర్మ, ఠాగూర్, వెంకటప్పయ్య, దామెర్ల వంటి వారి కోవకు చెందిన చిత్రకారుడే - అని పలువురు ఆయనను ప్రశంసించడం తెలుసు. వారంతా ఎవరో, వారి చిత్రకళ ఎంత గొప్పదో తెలియకపోయినా కొంత అర్థం చేసుకుంది ఆనాడే. పూలు కట్టిన దారానికి తావి అబ్బినట్టే పెళ్ళికి పూర్వం లేకపోయినా తర్వాత తనకూ కొంత అబ్బింది. క్రమేణా గీతలలోని సౌందర్యాన్నీ, రంగులలోని జీవిత సత్యాల్ని

కొంతవరకూ అవగతం చేసుకుంది. పూర్వజన్మ సుకృతముంటేనే గాని అటువంటి కళల పట్ల అభిరుచి ఉండదన్న సత్యాన్ని గ్రహించింది.

కాఫీ ఇచ్చి వెళ్ళినవాడు మళ్ళీ కనిపించడేం?

లోపల ఆడవాళ్ళూ, పిల్లలూ ఉన్న అలికిడి లేదు. ఒకవేళ యీ శశికాంత్‌కు పెళ్ళయి భార్య పుట్టింటికి వెళ్లిందేమో! ఎంతకీ లోపల్నించి ఎవరూ బయటకు రాకపోవడం విసుగ్గానే వుంది. పట్నవాసం మర్యాదలు ఇలాగే ఉంటాయి కాబోలు! అదే తాముండే వూరయితే ఇంట్లో వాళ్ళూ, చుట్టుపక్కల వాళ్ళు పలకరించాలి. అ తర్వాతే ఆతిథ్యం?

అలికిడైతే అటువైపు తిరిగారిద్దరూ.

ఆరడుగుల ఎత్తు, ఎత్తుకు తగ్గ నిండైన విగ్రహం. ఉంగరాల జుట్టు,ఎర్రగా వున్నాడు. వయసు ముప్పయ్ అయిదేళ్ళు వుండొచ్చు. పలకరింపుగా నవ్వి, ఎదురుగా కూర్చుంటూ, "చెప్పండి" అన్నాడు ఆమె వంక చూసి.

"నన్ను వసుంధరమ్మ అంటారు. గౌతమశర్మగారి భార్యను"

ఆశ్చర్యంగా ఆమె వంక చూశాడు శశికాంత్. మనసులో ఏదో ఉద్విగ్నత. అరవై అయిదేళ్ళు దాటి వుండవచ్చునేమో ఆమెకు. పచ్చగా వడిలిన పనసతొనలా ఉంది. వయసులో వున్నప్పుడు మరింత అందంగా వుండివుండొచ్చన్న నిదర్శనాలు ఆమె ముఖ కవళికల్లోనూ, కాంతి తగ్గని ఆ కళ్ళలోనూ కనిపిస్తున్నాయి. ఆమె కట్టుకున్న జరీ అంచు చీర గత కాలపు వైభవానికి చిహ్నంగా కనిపిస్తోంది. ఆమె పక్కనే ఒద్దికగా తలొంచుకుని కూర్చున్న కాత్యాయని వంక ఓ మారు చూసి దృష్టి మరల్చుకున్నాడు.

"అంటే... ప్రఖ్యాత చిత్రకారులు గౌతమశర్మగారి...."

'అవు'నన్నట్లు తలూపిందామె.

మాట్లాడాలనుకున్న మాటలు గుండెలోంచి గొంతు దాకా వచ్చి నాలుక చివరే ఆగిపోయాయతనికి. కాస్సేపాగి అన్నాడు. "చాలా సంతోషం. మీకు తెలుసో లేదో నేను మాస్టారికి ఏకలవ్య శిష్యుణ్ణి" అన్నాడు.

"తెలుసు బాబూ! రెండు రోజులు నాడు పేపర్లో నీ గురించి రాసింది చదివాం" అందామె.

అతను చిన్నగా నవ్వి తలొంచుకున్నాడు. ఆ నవ్వులో వినయమే కనిపించిం దామెకు.

మనిషిని చూస్తే తనొచ్చిన పని సానుకూలపడుతుందన్న నమ్మకం ఆమె కేర్పడింది. విషయం ఎలా బయటపెట్టాలా అని ఆలోచిస్తున్న లోపునే నౌకరు లోపలికొచ్చాడు.

"డ్రైవరు వచ్చాడు బాబూ, వసంత్ బాబు కుడిచెయ్యి..." అంటూ ఏదో చెప్పేడు.

చటుక్కున లేచి బయటకు వెళ్ళిన వాడల్లా క్షణంలో తిరిగొచ్చి, "క్షమించండి, నా శిష్యుడైన ఒక అబ్బాయికి ప్రమాదం జరిగింది. చూసి వెంటనే వచ్చేస్తాను. వచ్చి మీతో తీరుబడిగా మాట్లాడతాను. ఈలోగా లోపలి గదిలోని పెయింటింగ్స్ చూస్తూండండి" అని నౌకరుతో ఏదో చెప్పాడు.

"అలాగే, ముందు నువ్వెళ్లిరా బాబూ!" అంది ఏమనాలో తెలియక. కారు వెళ్లిన చప్పుడు విన్నాక లేచింది కాత్యాయని. లోపలి గదిలోని చిత్రాల్ని చూడాలనిపించిందామెకు. వెళ్తే బావుంటుందా?

ఆమె సంశయాన్ని గ్రహించిన నౌకరు, "లోపలికి రండమ్మా" అన్నాడు.

తమ గురించి శశికాంత్ అతనికేదో చెప్పినట్లే ఉన్నాడు.

'వెళ్దాం రా' అన్నట్లు వసుంధరమ్మ వంక చూసి అడుగు ముందుకు వేసింది కాత్యాయని.

రెండు పెద్ద గదులు కలిపినంత విశాలమైన హాలు. గోడలకు అందంగా ఫ్రేముల్లో బిగించిన ఎన్నెన్నో తైల వర్ణ చిత్రాలు! సహజమైన కుతూహలం, అభిరుచి,... వారిద్దరూ మంత్రముగ్ధుల్లా ఒక్కో చిత్రాన్నీ నెమ్మదిగా చూస్తున్నారు.

ఆ చిత్రాన్ని చూస్తూ ఒక్క క్షణం మైమరచిపోయింది వసుంధరమ్మ. తెల్లటి నురగలు కక్కుతూ ఎగిసిపడే నీలి సముద్రం... ఆ ఒడ్డున ఎడారిలా... గుట్టలు గుట్టలుగా బంగారు రంగులీనుతూ ఇసుక, కాస్త ఎడంగా ఎర్రమట్టి దిబ్బలూ, ఆ రెంటి మధ్యా పరుచుకున్న ఎర్రనెర్రని పచ్చ పచ్చని బటానీ పూల తీగలూ, దూరంగా 'డాల్ఫిన్స్ నోస్' ఆకారంలో ఓ కొండా, దానికి ముందు చిన్న చిన్న గుట్టల మీద మూడు మతాలకూ చెందిన దేవుళ్ళ ఆరాధనా మందిరాలూ, వీటన్నిటినీ కలుపుతూ దిగంతాల వరకూ విస్తరించిన నీలాకాశం, అక్కడక్కడ మలి సంధ్యకు ఎర్రబడ్డ మబ్బుల తునకలూ, ప్రకృతంతా ఒక చిన్న పటంలో బంధించినట్టుందా చిత్రం! 'విశాఖ సౌందర్యం' అనే పేరు గల ఆ చిత్తరువును చూస్తుంటే ఎప్పటివో జ్ఞాపకాలు! తొలిసారి సముద్రాన్ని చూసిన వైనం ఒక్క క్షణం కనుల ముందు నిలిచింది.

పుట్టి పెరిగింది పల్లె వాతావరణంలో. నదులూ, వాగులే తప్ప సముద్రాన్నెరుగదు. ఆయన చిత్రాల్లోనే పరిచయమైంది.

విశాఖ టౌన్ హాల్లో ఆయన చిత్ర ప్రదర్శన - రమ్మనగానే తలూపి తయారైపోయింది. ఆయనతో ఊళ్ళు తిరగాలని కాదు. సముద్రాన్ని చూడాలని! జటకా బండీ; జనతా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళేసరికి పొద్దుబోయింది. ఆ రాత్రి చూసింది చీకట్లో సముద్రాన్ని. కెరటాల హోరు. గాలి జోరు. హార్బరు దీపాల మిలమిలలు, వింతగా, కొత్తగా అనిపించింది. కాస్త భయమేసింది కూడా. మర్నాడు ఉదయం మళ్లీ చూస్తే పాల నురుగల తెల్లంచు నీలిచీర భూమ్మీద పరిచినట్టు. అదే సముద్రం... ఆహ్లాదంగా!!

ముందుకు నడుస్తున్న కొద్దీ ఎన్నెన్నో సుందర ప్రకృతి దృశ్యాలు – రంగు రంగుల నేలలు, వింత వింత కాంతుల ఆకాశం – సంప్రదాయంగా ప్రతిబింబిచాయి!

ఆ చిత్రాల్లో ఎక్కడో కొట్టొచ్చినట్టు కనపడే ఆత్మీయత – ఆ రంగుల కలయికలోనూ, వ్యాపించి పరుచుకునే ప్రకృతిలోనూ కన్పించే దగ్గరితనం వసుంధరమ్మను ఆశ్చర్యచకితురాల్ని చేశాయి.

ఈ శశికాంత్‌లో ఇంతటి అద్భుత కళ దాగి ఉందా అనిపించింది. వాటిల్లో

కొన్ని జాతీయ అధునిక చిత్రకళా గేలరీల్లో భద్రపరచాల్సిన చిత్రాలున్నాయి. రామణీయకతతో పాటు కల్పనాత్మక సహజత్వం!

ఎప్పుడో... పాతికేళ్ళ క్రితం ఆయన మాటల ద్వారా, కుంచెలు చిమ్మిన రంగుల ద్వారా నేర్చుకున్న చిత్రాల భాష! చిత్రకారుడి అంతరంగ మధనం, తైలవర్ణాల వెనుక వున్న అంతర్లయ – వాటిని అవగతం చేసుకోవడంలోనూ, అభ్యసించడంలోనూ తరచి చూడ్డంలోనూ సింధువులో బిందు ప్రమాణంగా అబ్బిన కుతూహలం, లాలన...

అన్నీ స్మృతిపథంలో మెదులుతున్నాయామెకు. ఆలోచనలు అడుగు ముందుకు పడనీయడం లేదు. నెమ్మదిగా నడిచి హాలు మధ్య భాగంలో ఉన్న సోఫా మీద కూర్చుంది. కాలి కింద మెత్తని తివాచీ. అంతకు మించిన మెత్తదనంతో నునుపుతో సోఫా, వెనక్కు వాలి విశ్రాంతిగా కూర్చోబోతూ అప్పుడు చూసింది ఎదురుగా ఉన్న ఆ చిత్రాన్ని. ఒక్క క్షణం తనువూ మనసూ అచేతనంగా ఉండిపోయాయి!

దివ్యజ్ఞానమంతా ప్రతిబింబించే ఆ నేత్రాలు.... విశాలమైన ఆ ఫాలభాగం మధ్య వెలుగుతూ సూర్యబింబంలా ఆ తిలకం.. శివ ధనుస్సులా వంగిన ఆ కనుబొమలు... ఎప్పుడో ఎక్కడో పరిచయమున్న ఆ వదనం, కళాకారుడి తపోఫలితంగా అతని కుంచె నుండి జాలువారుతూ అతన్ని కీర్తి శిఖరాల నధిరోహింపచేయగల సజీవ సహజ సౌందర్యం!

స్మృతి పథంలో మళ్ళీ ఏవేవో తెరలు!

"ఇదిగో... ఇది చూశావా అత్తయ్యా?" – ఆశ్చర్యంతో పరుగు పరుగున వచ్చి, తన చేయి పుచ్చుకుని లేపి, హాల్లో రెండో వైపు గోడకున్న చిత్రాల వైపు దారి తీసింది కాత్యాయని. ఆమె వెంట బొమ్మల్లే నడిచి, ఆమె వంక చూసింది వసుంధరమ్మ.

*'శయన మందిరం', 'ముగ్ధ కన్యలు', 'లావణ్య', 'నది నుండి'*, చిత్రాలు వరుసగా – ఆ చిత్రాలలోని వనితల ముఖాల్లో ఓ చిత్రమైన వెలుగు, లాలిత్యం, అంతకంటే విచిత్రం ఆ చిత్రాలలోని వనితల మేనివంపులూ, రూపరేఖ విలాసాలూ అన్నీ ఒకే మాదిరిగా ఒకరినే పోలి ఉండడం.

ఆమె చూపులు ఆసక్తిగా పరుగులెత్తాయి. గౌతమ్! మనసులో నాటుకున్న అనుమానపు బీజం. అదే నిజమయ్యిందా? ఆలోచనల్లో ఏవేవో రంగు రంగుల వింత దృశ్యాలు! జ్ఞాపకాల తీగ నెమ్మదిగా వెనక్కు కదిలింది.

చిన్న వయసులోనే పెళ్ళి.... వేరింటి కాపురం. ఆయనొక చిత్రకారుడని పెళ్ళికి ముందే తెలిసింది. కానీ ప్రకృతి చిత్రాలు అంత అద్భుతంగా మల్చగల చిత్రకళా శిల్పి అనుకోలేదు. ప్రకృతి సౌందర్యాన్ని తన గుప్పెట చిక్కించుకున్న శిల్పి తన స్వంతం అన్న ధీమా.

ఆర్థిక సమస్యల్ని కప్పిపుచ్చే ఆనందకరమైన రోజులు – రెండేళ్ళు తిరిగే సరికి తమ ఇంట మూడో మనిషి 'చిత్ర'. పాపకాపేరు పెట్టింది ఆయనే.

అప్పట్లో వేసిన ఆయన చిత్రాలన్నీ అందమైన బాలలే! వారి కవళికలూ, కదలికలూ

అన్నీ చిత్రనే పోలి ఉండేవి!

జ్ఞాపకాలు... జ్ఞాపకాలు!

కలనేత రంగుల్లా ...జీవిత గతస్మృతులూ!

చిత్ర పుట్టిన కొద్ది రోజులకే చేస్తున్న ఆ చిన్న ఉద్యోగం వూడింది. అప్పట్లోనే కొన్ని అపురూప ప్రకృతి చిత్రాలు మంచి ధరకు అమ్ముడుపోయాయి. కళ పట్ల ఆయనలోని విశ్వాసం, పట్టుదల ద్విగుణీకృతమయ్యాయి.

చిత్రకళా ప్రదర్శనలకు వివిధ ప్రాంతాలకు వెళ్ళిరావడం, వాటి ప్రభావం... ఆయన చూపులో... దృక్పథంలో మార్పును తెచ్చాయేమో!

మళ్లీ ఉద్యోగ ప్రయత్నం లేదు. వృత్తి, వ్యాపకం.. చిత్రకళే!

నాలుగు రాత్రులూ, నాలుగు పగళ్ళూ ఏకబిగిన కూర్చుని పూర్తి చేసిన చిత్రం 'సౌందర్యరాశి' ఒక చిత్ర ప్రదర్శనలో అమ్ముడై ఊహించనంత డబ్బును తెచ్చిపెట్టింది. ఆ చిత్రంలోని అపురూప సౌందర్యరాశి ఎవరన్నది ఇప్పటికీ తన మదిలో మిగిలిపోయిన ప్రశ్న!

రాన్రాను ప్రకృతి దృశ్యాలను చిత్రించే ఆయన కుంచె సుందరీమణుల మేని అందాల్ని చిత్రించడం ఆశ్చర్యమనిపించింది. ఆ మార్పు వెనుక ప్రేరణ ఏమైనా ఉందా?

ఆయన చెప్పరు - తనకు అడిగే ధైర్యం లేదు.

ఆ తర్వాత రూపుదిద్దుకున్న ఎన్నో చిత్రాలు. ముఖ్యంగా 'విరహోత్కంఠిత', 'వధువు' -ఎక్కువ సొమ్మునే తెచ్చిపెట్టాయి. అటువంటి చిత్రాల మాతృకలన్నీ తన వద్దే భద్రపరచుకున్నారాయన. విచిత్రమేమంటే ఆ సుందరీమణుల ముఖకవళికలన్నీ మొదట వేసిన ఆ 'సౌందర్యరాశి'ని పోలి ఉండడమే.

పూసలపేరులోని పూసల్ని వరుసగా స్పృశించినట్టు జ్ఞాపకాలు... ఒక్కొక్కటే!

కరుణ, ప్రేమ, దయ- చిత్రకళ ఇవి తప్పితే మరొకటి తెలియని ఆయన గురించి క్రమంగా ఏవేవో పుకార్లు చెవుల్లో గుసగుసలు.

పట్నంలో ఓ ధనికురాలైన స్త్రీతో ఆయనకు పరిచయం! చిత్రాలలోని భంగిమలన్నీ ఆమెవేనట!

తనపై ఆయన చూపే ప్రేమలో, అభిమానంలో ఒకింత కూడా లోపం రాలేదు మరి!

పదిహేనేళ్ళు ఏం కాపురం చేసిందో - కాలం కాటు వేసింది. గుండెపోటుతో ఆయన పోవడం, మరో అయిదేళ్ళకే తండ్రిని వెతుక్కుంటూ చిత్రా పోవడం...

ఒంటరిగా.... ఏకాకిగా.. దుర్భర జీవితం!

గత పదేళ్ళుగా తలచుకోని సంఘటనలు ఈ రోజే ఎందుకు గుర్తుకు రావాలి? తన జ్ఞాపకాల్లో ఎందుకు మెదలాలి?

ఆ చిత్రం..... అదే చిత్రం... ఆ అపురూప సౌందర్యరాశిని పోలిన చిత్రం ఈ రోజిక్కడ కనబడటమేమిటి?

ఆయనకు ఏకలవ్య శిష్యుడనుకున్న శశికాంత్‌లో ఆయన పోలికలుండడమేమిటి?
ఏవిటీ ప్రకృతి చిత్రం?

◆ ❖ ◆

వెళ్లిన రెండు గంటల తర్వాత వచ్చాడు శశికాంత్. ఆ అబ్బాయిని ఆసుపత్రికి తరలిస్తే కుట్లు పడ్డాయట! ఆలస్యమైనందుకు వస్తూనే నొచ్చుకున్నాడు.

లోపలికెళ్ళి నౌకరుతో ఏం చెప్పాడో పక్క గదిలోంచి గిన్నెలూ, పళ్ళేల చప్పుళ్ళు.

"భోజనం చేశాక విషయాలన్నీ మాట్లాడుకోవచ్చు. పెరట్లో పంపుంది. వేరే గదీ, బాత్రూం కూడా...." అతని మాటలు పూర్తి కాలేదు.

"ఎందుకు బాబూ అదంతా? వెళ్ళిపోతాంగా! నువ్వెళ్లాక టిఫిన్ కూడా...."

"నాకు తెలుసు మీ వంటివారు ఇష్టపడరని. కానీ వేళగాని వేళ. ఎండ వేళ. పప్పన్నమో, పెరుగూ అన్నమో, పళ్ళో మీ ఇష్టం..." అన్నాడు.

నౌకరొచ్చి బాత్రూమూ, పెరడూ, గదీ చూపించాడు. కాదనలేని పరిస్థితి. ఆ రెండు ముక్కలూ అతనితో చెప్పి, వచ్చిన పని కాస్తా అయిందనిపించుకుని తిరుగు ముఖం పట్టినా, భోజనాలవేళ అవటంతో బస్సులుండవ్. వెళ్ళేసరికి నాలుగు గంటలై పోతుంది.

ముఖమూ, కాళ్ళూ కడుక్కొని వచ్చేసరికి బల్ల మీద అన్నీ సర్ది వున్నాయి.

భోజనాలయ్యాక హాల్లో కొచ్చి కూర్చున్నారు.

అప్పుడు చూశాడు శశికాంత్ కాత్యాయని వంక. బంగారు తీగకు సంస్కార మబ్బినట్టు అందాల ప్రోగే అమాయకమైన రూపుదిద్దుకున్నట్టు. చకితుడయ్యాడొక్కమారు ఆమె నాజూకు సౌందర్యానికి.

"మా అన్నయ్య కూతురు. పేరు కాత్యాయని. ఇంట్లో కూర్చునే బియ్యే చదివింది. అన్నయ్య పోయిన దగ్గర్నుంచీ నా దగ్గరే ఉంటోంధి. దానికి నేను.. నాకు అది" అంది వసుంధరమ్మ.

తప్పు చేసి దొరికిపోయినవాడిలా తడబడి, చూపు మరల్చుకుని పలకరింపుగా నవ్వాడు శశికాంత్.

బయట ఎండ నిప్పులు కురిపిస్తున్నా లోపల చల్లగా, ప్రశాంతంగా ఉంది. ఇంతవరకూ వచ్చాక ఇప్పుడు చెప్పాలా వద్దా అన్న సందిగ్ధంలో పడింది వసుంధరమ్మ.

ఆమె పరిస్థితి గమనించిన దానిలా 'ఆలస్యమైనందుకిక' అన్నట్టు చూసింది కాత్యాయని.

"మీరొచ్చిన పనేమిటో నిస్సంకోచంగా చెప్పండి" అన్నాడు శశికాంత్.

"గౌతమశర్మగారి చిత్రకళ గురించి నీకు తెలియంది కాదు. ఆయన వేసిన వందల చిత్రాల్లో అమ్ముడైనవీ, ఆర్టు గేలరీలకూ, బహుమతులుగా స్నేహితులకూ యిచ్చినవి కాక సుమారొక వంద చిత్రాలు నా వద్ద ఉన్నాయి. ప్రస్తుతం అవి నా లాగే అజ్ఞాతంగా అనామకంగా ఆ పల్లెలో ఓ మూల ఉండిపోయాయి. వాటిని భద్రపరచేందుకు

తగిన వసతులు లేవు. అభిరుచి, యోగ్యత ఉన్న నీ వంటి వాడి దగ్గర అవి ఉంటే...." ఆమె మాట పూర్తికాలేదు.

ఒక్కమారు సోఫాలోంచి లేచాడు శశికాంత్.

"అంతకంటే అదృష్టమా? నాకీ కళా జీవితాన్నీ, గుర్తింపునూ ఇచ్చింది శర్మగారు. వారి చిత్రాల్ని పరిరక్షించడం కోసం నా జీవితాన్నయినా ధారపోస్తాను" అంటూ తన వెంట రమ్మన్నట్టుగా కదిలాడు.

అర్థం కాకపోయినా లేచారిద్దరూ. హాలు దాటి లోపలకి వెళ్తే మరొక హాలు. ఆ హాల్లో ఉత్తర దిశ గోడకు మంచి గంధం పూల దండ వేసి ఉన్న నిలువెత్తు చిత్రపటంలో గౌతమశర్మగారు!

ఒక్కమారు ఒళ్ళు జలదరించింది వసుంధరమ్మకు. మనిషంత ఎత్తునున్న చిత్రం. జీవం ఉట్టిపడుతూన్న శర్మగారి ముఖం గోధుమరంగు పట్టులాల్చీ, మల్లెపూవు లాంటి పంచ, గోల్డు ఫ్రేం కళ్ళద్దాలూ.

దాన్ని శశికాంతే వేసిన నిదర్శనంగా క్రింద సంతకం.

కాత్యాయనికి అదంతా వింతగా ఉంది. ఆ గదిలో ఈజిల్ మీదా, అక్కడక్కడా ఇంకా అసంపూర్ణ చిత్రాలున్నాయి. గది మధ్య రోజ్ వుడ్ టీపాయ్ మీద పేలెట్‌లో కలిపిన రంగులు, రకరకాల కుంచెలు.

ఒక అసంపూర్ణ చిత్రం వద్ద ఆగిపోయింది కాత్యాయని. మంచుతో తడుస్తూన్న వెన్నెల రాత్రి అందాలు!

"మీకిది అనుభవానికొచ్చిన దృశ్యమా, లేక ఊహా చిత్రమా?" అడిగింది కాత్యాయని. తొలిసారిగా ఆమె నోటంట సుమధుర సంగీతం. నవ్వి ఊరుకున్న అతని వంకోమారు చూసి అర్థమైన దానికి మళ్ళే దృష్టి మరల్చుకుంది కాత్యాయని.

గుమ్మం దాటి తిరిగి వస్తూ ముందు హాల్లోని ఆ ఫోటో వద్ద ఆగి అన్నాడు. "మా అమ్మగారు. ఆవిడకు చిత్రకళంటే వల్లమాలిన అభిమానం. శర్మగారి చిత్రాలు మా ఇంట్లో చోటు చేసుకోవడానికి, నాకు చిత్రకళ పట్ల అభిరుచి పెరగటానికి ఆమె కళాభిమానమే కారణం."

నర్మగర్భంగా ఉండే సత్యమేదో పొగమంచులా విడిపోయినట్లయి ఆ చిత్రం వంకా, అందులోని అపురూప సౌందర్యం వంకా మరొక్కసారి చూసింది వసుంధరమ్మ.

"శర్మగారి పేరిట ఒక చిత్రకళా నికేతన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఏడాది క్రితం వచ్చింది. ఉత్సుకతా, ఆసక్తీ ఉన్న విద్యార్థులు అప్పుడే ఓ పదిమంది వరకూ పోగయ్యారు. కళా విలువలు అడుగంటిపోతున్న ఈ యాంత్రిక రోజుల్లో సంవత్సరాని కొక్క చిత్రకారుడిని లోకానికి పరిచయం చేయగలిగినా నా ఆశయం నెరవేరినట్లే. ఈ సమయంలో తల్లి తర్వాత తల్లిలా మీరు శర్మగారి చిత్రాలను నాకందజేయాలనుకోవడం నిజంగా నా అదృష్టమే" అన్నాడు.

అప్పట్లో ఆయన కోరిక... ఇప్పుడీ శశికాంత్ ఆశయం... ఆశ్చర్యకరమైన

భావసారూప్యం!

కాత్యాయని ఏవేవో ప్రశ్నిస్తోందతనిని. అతనేదో చెబుతున్నాడు. తనకా మాటలేం చెవి కెక్కటం లేదు. చిత్రే బతికుంటే ఈ శశికాంత్ వయసుదే అయి ఉండేదేమో! మనసు కలుక్కుమని వసుంధరమ్మ కళ్ళలో నీటిపొర చేరింది.

జ్ఞాపకాలు... జ్ఞాపకాలు... పుష్పాల్నీ ఫలాల్నీ చేజార్చుకుని మోడైన జీవిత గత చరిత్ర జ్ఞాపకాలు.

ఎంతసేపలా ఉండిపోయిందో!

చల్లని గాలి హాయిగా వచ్చి శరీరాన్ని తాకితే చటుక్కున కళ్ళు విప్పింది. ఆకాశంలో తేలిపోతూ మబ్బు దొంతరలు. గదిలోంచి వీధిలోకి వస్తే పూలమొక్కల మధ్య వాళ్ళిద్దరూ ఆనందంగా కబుర్లు చెప్పుకుంటూ....

తనను చూసి ఒక్క గంతులో వచ్చింది కాత్యాయని, "వెళ్దామా అత్తయ్యా?" అంటూ.

ఆమె వెనకే శశికాంత్.

అంతలోనే టీ కప్పులతో ప్రత్యక్షమయ్యాడు నౌకరు కుర్రాడు.

టీ అయింది తను వచ్చిన పని కూడా అయింది.

"వెళ్ళొస్తాం బాబూ. నా కోరికను నువ్వు మన్నించావు. ఎంతో సంతోషంగా ఉంది. చిత్రపటాల్ని సాధ్యమైనంత త్వరలో నీ దగ్గరకు చేరుస్తాను" అంది వసుంధరమ్మ లేస్తూ. ఆమె గొంతులో వణుకు.

శశికాంత్ సర్దుకుని లేచాడు. అతనిలో ఏదో సందేహం. ఏదో చెప్పాలనే తహతహ.

"అమ్మ పోయిన ఈ ఆరేళ్ళ తర్వాత మళ్ళీ ఇన్నాళ్ళకు ఈ ఇంట్లో అమ్మ లాంటి మిమ్మల్ని చూశాను. నా ఇంట్లో పట్టెడన్నం తిన్నారు. నాకో నిధిని బహుమతిగా ప్రకటించారు. అదే చాలునని అనుకోవటం లేదు. గురుపత్ని మాతృమూర్తితో సమానమని నా నమ్మకం. మరి... నా కోర్కెను మీరు మన్నిస్తే లంకంత కొంపలో ఈ ఒంటరి బ్రతుకు బతకాల్సిన అవసరముండదు" – అతని గొంతు బొంగురుబోయింది.

ఆశగా ఆమె కళ్ళలోకి చూసింది కాత్యాయని.

వసుంధరమ్మ మనసులో ఎన్నో చిత్రమైన ప్రశ్నార్థకాలు!

అన్నీ తెలిసే అడుగుతున్నాడా ఈ శశికాంత్?

"ఇన్నాళ్ళూ వారి చిత్రాల్లోనే నా పంచ ప్రాణాలు నిలపి ఆయనను చూసుకుంటూ వచ్చాను, మరి. వాటిని నీ దగ్గరకు చేరిస్తే నేనూ వచ్చినట్టు కాదా?"

అర్థం కానట్టు అచేతనంగా ఉండిపోయాడతను.

వసుంధరమ్మ అడుగు ముందుకు వేసింది.

ఆమె వెనుకే కాత్యాయని!

● *ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక – 30 అక్టోబరు, 1991*